సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

శనివారం । 20 । జనవరి । 2024



అంబేడ్కర్ ఆశయం.. జగనన్నతోనే సాధ్యం

జీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. -8లో



వేటు పడింది..!

స్త్రీ నిధి, సీఐఎఫ్ నిధుల దుర్వినియోగంపై డీఆర్‌డీఏ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. అవినీతికి పాల్పడిన వారిపై వేటు వేశారు. -8లో

గరిష్టం/కనిష్టం 31.8/20.3

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 20.3 – 31.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పౌర సరఫరాల శాఖలో బదిలీలు

ప్రొద్దుటూరు: జిల్లా పౌరసరఫరాల సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిలను బదిలీ చేస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప నగర పరిధిలోని అక్కాయపల్లె హెచ్‌పీసీఎల్ ఔట్‌లెట్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి జి.లింగస్వామిని ప్రొద్దుటూరు గోడౌన్‌కు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న పి.గురుప్రసాద్‌ను సంస్థ జిల్లా కార్యాలయానికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న కె.త్రివేణిని హెచ్‌పీసీఎల్ ఔట్‌లెట్‌కు బదిలీ చేశారు.

నేడు 'డయల్ యువర్ ఆర్‌ఎం'

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ సమస్యలపై శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ జిల్లా ప్రజా రవాణాధికారి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏపీఎస్ ఆర్టీసీ కడప ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలు 99592 25848 నంబరుకు, లేదా వాట్సాప్‌కు తెలియజేయవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేంద్రబృందం పర్యటన



కామసముద్రంలో విలేజ్ క్లినిక్ వద్ద కేంద్ర బృందం

లింగాల: లింగాల మండలంలోని కామ సముద్రంలో శుక్రవారం కేంద్రబృందం సభ్యులు డాక్టర్ రజత్,రీసర్చర్ ఇర్ఫాన్ పర్యటించారు. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుతున్న ప్రాథమిక సేవలు, అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుధ్యం తదతర అంశాలను వారు పరిశీలించారు. సచివాలయంలో పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సుభాషిణి, డిప్యూటి డీఎమ్‌ఎచ్‌ఓ ఖాజా మొయిద్దీన్, సీనియర్ అసిస్టెంట్ నరేష్, వైద్యులు హారీపుల్లా, సూపర్ వైజర్లుశివరామ్, ఎఎన్‌ఎమ్‌లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

28 నుంచి కబడ్డీ పోటీలు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ సత్యనారాయణ

రాయచోటి: రాజంపేటలో ఈనెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 1 వరకు జాతీయ అండర్–14 బాలికల కబడ్డీ పోటీలు జరుగుతాయని డీఆర్‌ఓ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పోటీల నిర్వహణపై డీఆర్‌ఓ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ పోటీలను రాజంపేట పట్టణంలోని ఇన్ఫాంట్ జీసస్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ క్రీడా పోటీలకు రాష్ట్రంలోని జవహర్ నవోదయ పాఠశాలల నుంచి 44 టీమ్‌లు రానున్నాయన్నారు. ఇప్పటి వరకు 31 టీమ్‌లు ఆన్‌లైన్ రిజిస్టర్ చేయించుకున్నారన్నారు ఆసక్తి ఉన్నవారు ఈనెల 22వరకు ఆన్‌లైన్ రిజిస్టర్ చేయించుకోవచ్చన్నారు. కబడ్డీ క్రీడా పోటీలకు 450 మంది క్రీడాకారులు, టెక్నికల్, ఇతరులు 150 మంది హాజరు కానున్నారని తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజనం , ట్రాన్స్‌పోర్టేషన్‌కు సంబంధించి 20 కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రంగస్వామి, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంత, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు పెరిగె.. రైతు మురిసె

- ప్రాజెక్టుల అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- కేటాయింపు, శరవేగంగా పనులు
- జూన్ వరకు సాగునీరు అందించేందుకు చర్యలు
- సాగునీటి ప్రాజెక్టు అభివృద్ధి పనులను గాలికి వదిలేసిన టీడీపీ ప్రభుత్వం



గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ కెనాల్

కడప సిటీ: రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోంది. వారిని ఆదుకునేందుకు ప్రాజెక్టుల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించింది. పనులు వేగవంతం చేసింది. దీంతో ఆయకట్టు పెరిగింది. టీడీపీ ప్రభుత్వంలో 2019 వరకు గండికోట అనుబంధ ప్రాజెక్టులైన జీకేఎల్‌ఐ, పీబీసీ, మైలవరం ద్వారా కేవలం 44,500 ఎకరాలు మాత్రమే ఆయకట్టు ఉండేది. మైలవరం ప్రాజెక్టును ఎప్పుడూ పూర్తి సామర్థ్యంతో నింపిన దాఖలాలు లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మైలవరాన్ని ఆరు టీఎంసీలు, గండికోట ప్రాజెక్టును 26.5 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నింపారు. జల జీవనాడిగా గండికోట ప్రాజెక్టును తీర్చిదిద్దేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో ఆయకట్టు పెంపునకు అవకాశాలు ఏర్పడ్డాయి. టీడీపీ హయాంలో కన్నా ప్రస్తుతం మూడింతలకు పైగా ఆయకట్టు పెరిగింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో 1,50,000 ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు మార్గం ఏర్పడింది.

మైలవరం ఆయకట్టు స్థిరీకరణ 75 వేల ఎకరాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మైలవరం ప్రాజెక్టు కింద ఆయకట్టు భారీగా పెరిగింది.టీడీపీ ప్రభుత్వంలో 2019 వరకు కేవలం 15 వేల ఎకరాలు మాత్రమే ఆయకట్టు ఉండేది.75 వేల ఎకరాలకు ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పెరిగింది.నిర్మాణాత్మక పనులకు రూ. 4 కోట్ల నిధులు వెచ్చించింది.జమ్మలమడుగు, పులివెందుల, ప్రొద్దుటూరు, కమలాపురం తదితర నియోజకవర్గాలకు సాగు, తాగునీటిని అందించేందుకు ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంతేకాకుండా నొస్సం బ్రాంచ్ కెనాల్ నుంచి టంగుటూరు బ్రాంచ్ కెనాల్, వెలవలి, గోపవరం సౌత్ కెనాల్, నార్త్ కెనాల్‌కు సంబంధించి పూడికతీత పనులు చేపట్టింది.దీనివల్ల ఆయకట్టుకు నీరిచ్చేందుకు అవకాశం ఏర్పడింది. మైలవరం నుంచి కేసీ కెనాల్ ద్వారా ఆదినిమ్మాయపల్లె ఆనకట్టకు 250 క్యూసెక్కుల నీటిని తరలించి 12 వేల ఎకరాలు ఎండిపోకుండా ఖరీఫ్‌లో ఈ ప్రభుత్వం కాపాడగలిగింది. అంతేకాకుండా టంగుటూరు, వెలవలి కెనాల్ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని తరలించి ఐదు వేల ఎకరాల ఆయకట్టు ఎండిపోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. దాదాపు మూడు నెలలపాటు నీళ్లిచ్చారు.

పీబీసీ నుంచి..

పులివెందుల బ్రాంచ్ కెనాల్ కింద 55,500 ఎకరాల ఆయకట్టు ఉండగా, 40 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2020 మార్చి నుంచి ఈ కాలువల ద్వారా నీళ్లివ్వడం జరుగుతోంది. 68 కిలోమీటర్ల పొడవుగల ఈ కెనాల్ ద్వారా అనంతపురం జిల్లాలోని గొడ్డుమర్రి, సింహాద్రిపురం, లింగాల, పులివెందుల, వేముల, తొండూరు, వేంపల్లె వరకు నిర్మాణాత్మక పనులు చేపట్టడం వల్ల నీళ్లందించే పరిస్థితి ఏర్పడింది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2019 వరకు కేవలం 15 వేల ఎకరాలు మాత్రమే ఆయకట్టు ఉండగా, నిర్మాణాత్మక పనులైన కాలువల మరమ్మతులు, డిస్ట్రిబ్యూటరీ, పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఆయకట్టు పెంపు ప్రశ్నార్థకంగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ. 35 కోట్లు వెచ్చించి పనులు పూర్తి చేసింది.

ప్రాజెక్టు పనులను గాలికి వదిలేసిన టీడీపీ ప్రభుత్వం

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో జలయజ్ఞం పేరిట జిల్లా ప్రాజెక్టుల అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం పనులను గాలికి వదిలేసింది.తర్వాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలో నడుస్తూ జిల్లా ప్రాజెక్టుల అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. దీంతో గండికోట అనుబంధ ప్రాజెక్టులుగా ఉన్న మైలవరం, సీబీఆర్, జీకేఎల్‌ఐ, పీబీసీ వాటి కింద ఆయకట్టు పెరిగింది. టీడీపీ హయాంలో ఈ ప్రాజెక్టుల కింద కేవలం 44,500 ఎకరాలు ఆయకట్టు మాత్రమే ఉండగా, ఈ ప్రభుత్వ హయాంలో 2,37,400కు పెరిగింది. అంతేకాకుండా 1,50,000 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు అవకాశం ఏర్పడింది.

జీకేఎల్‌ఐ ద్వారా 30 వేల ఎకరాలకు నీళ్లు

గండికోట లిఫ్ట్ ఇరిగేషన్(జీకేఎల్‌ఐ) కింద 47,500 ఎకరాల ఆయకట్టు కాగా, 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందిస్తున్నారు. 85 కిలోమీటర్ల మేర పిల్ల కాలువలు తవ్వడంతో ఆయకట్టుకు నీళ్లందించేందుకు మార్గం ఏర్పడింది.పైడిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 15 చెరువులను నింపి భూగర్భ జలాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నారు.గత ప్రభుత్వ హయాంలో 2019 వరకు కేవలం 7500 ఎకరాలు మాత్రమే ఆయకట్టు ఉండేది. నిరాణాత్మక పనులు చేపట్టకపోవడంతో ఆయకట్టు పెరిగేందుకు వీలు లేకుండా పోయింది.

తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవు



ప్రస్తుతం గండికోట అనుబంధ ప్రాజెక్టులకు సంబంధించి ఆయకట్టు బాగా పెరిగింది. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పిల్ల కాలువల పనులను పూర్తి చేశాం. సీబీఆర్, పీబీసీ, జీకేఎల్‌ఐ, మైలవరం నుంచి డిసెంబరు 24వ తేదీ వరకు తాగునీరు అందించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవు. జూన్ వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నాం.

– మల్లికార్జునరెడ్డి, ఎస్‌ఈ, జీఎన్‌ఎస్‌ఎస్, కడప

సాగునీటి అవసరాలకు అనుగుణంగా పనులు



గండికోట అనుబంధ ప్రాజెక్టుల ద్వారా రైతులకు సాగునీటి అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాం. కాలువల మరమ్మతు, పూడికతీత, పిల్ల కాలువల పనులు చేపట్టడంతో ఆయకట్టుకు నీరిచ్చేందుకు అవకాశం ఏర్పడింది. ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇచ్చి ప్రాజెక్టుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నాం. ప్రస్తుతం జూన్ వరకు సాగునీటికి, డిసెంబరు వరకు తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– విజయరామరాజు, జిల్లా కలెక్టర్

▶▶ సీబీఆర్ కింద..



చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించిన కెనాల్

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా 30 వేల ఎకరాల ఆయకట్టు అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిస్ట్రిబ్యూటరీ ద్వారా 15 వేల ఎకరాలకు, వివిధ లిఫ్ట్‌ల ద్వారా 15 వేల ఎకరాలు మొత్తం 30,000 ఆయకట్టుకు నీళ్లు అందిస్తున్నారు. మొత్తం ఈ ప్రాజెక్టు కింద 59,400 ఎకరాల ఆయకట్టు కాగా, 30 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టింది. కొండ ప్రాంతాలైన ఎగువపల్లి, దిగువపల్లి, మురారిచింతల, కోమన్నూతల, ఎర్రబల్లి, వెలిదండ్ల తదితర ప్రాంతాలకు 14 లిఫ్ట్‌ల ద్వారా సాగునీటిని అందించారు. 15 గ్రామాలకు తాగునీరు అందించేందుకు కూడా అవకాశం ఏర్పడింది. భూగర్భ జలాలు పెరగడం వల్ల బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉంటున్నాయి. 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 7000 ఎకరాలు మాత్రమే ఆయకట్టు ఉండగా, నిర్మాణాత్మక పనులు ఏమాత్రం చేపట్టలేదు. కాలువల మరమ్మత్తులు, డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి కాకపోవడం, అసంపూర్తిగా ఉన్న లిఫ్ట్ పనులను పూర్తి చేయకపోవడంతో ఆయకట్టు అభివృద్ధి పడకేసింది. నవంబరు 2020లో పది టీఎంసీల పూర్తి సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును నింపిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానిదే. డిస్ట్రిబ్యూటరీలకు రూ. 15 కోట్లు, డీప్ వాల్‌కు రూ. 25 కోట్లు, లిఫ్ట్‌ల నిర్మాణానికి రూ.10 కోట్లు కలిపి మొత్తం రూ. 50 కోట్ల నిధులు కేటాయించి పనులు చేపట్టింది. దీంతో ఆయకట్టు పెరగడానికి వీలు కలిగింది.

వేమన పద్యాలు తరగని సంపద

కలెక్టర్ విజయ్‌రామరాజు



వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలుగు భాషను సరళంగా వర్ణించిన ప్రజాకవి యోగి వేమన అని, ఆయన కూర్చిన ఆటవెలది పద్యాలు తెలుగు సాహితీ రంగంలో తరగని సంపద అని కలెక్టర్ విజయ్ రామరాజు అభివర్ణించారు.శుక్రవారం కలెక్టరేట్ లోని స్పందన హాలులో 'యోగి వేమన' జయంతి నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక రుగ్మతలపై, సమాజ సంస్కరణకు కృషి చేసిన గొప్ప దార్శనికుడిగా వేమనను పేర్కొనవచ్చన్నారు.భాషను, భావాన్ని ప్రజలకు చేరువ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వేమన ఆవిష్కరించిన నైతిక విలువలను పెంపొందించే కావ్యాలను యువత ఆదర్శంగా తీసుకొని నవ సమాజ సంస్కరణలో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. తొలుత యోగి వేమన చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏవో విజయ్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు డీఐఈపీసీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగిస్తూ పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. జి ల్లాలో పారిశ్రామిక రంగాన్ని విస్తృతం చేసి జిల్లా ఆర్థిక అభివృద్ధితోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లు సహకరించాలన్నారు. పరిశ్రమల ప్రమోషన్‌కు సంబంధించి ఇంకా ఏవైనా అప్లికేషన్లు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (ఐడీపీ) 2020–23 ప్రకారం వైఎస్‌ఆర్ జగనన్న బడుగు వికాసం ద్వారా ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి సంబంధించి 2 యూనిట్లకు జనరల్ కేటగిరీకి సంబంధించి 1 యూనిట్‌కు ఐడిపి 2015–20 ప్రకారం పరిశ్రమల వడ్డీ రాయితీ 2 యూనిట్లకు, ఐడీపీ 2020–23 ప్రకారం పరిశ్రమల వడ్డీ రాయితీ 2 యూనిట్లకు, ఐడీపీ 2015–20 ప్రకారం పరిశ్రమల (జనరల్) పవర్ కాస్ట్ రీఎంబర్స్‌మెంట్ 2 యూనిట్లకు, ఐడీపీ 2020–23 ప్రకారం పరిశ్రమల (జనరల్) పవర్ కాస్ట్ రీయింబర్స్‌మెంట్ 3 యూనిట్లకు, ఐడీపీ 2015–20 ప్రకారం పరిశ్రమల (జనరల్) స్టాంప్. డ్యూటీ రీయింబర్స్‌మెంట్ 1 యూనిట్‌కు మొత్తం 13 యూనిట్లకు రూ. 30.6 లక్షల రాయితీ మొత్తం విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి సంబంధిత వివరాలను సమావేశంలో కలెక్టర్ కు వివరించగా ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఏపీఐఐసీ జెడ్‌ఎం నాగరాజు, డిక్కీ.కోఆర్డినేటర్ శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరి ఆడట్లేదు

- ఎర్రగుంట్ల క్రూ సెంటర్‌కు లోకోపైలెట్స్ దూరం
- కాలుష్యం నీడలో వెంటాడుతున్న అనారోగ్య భయం
- పక్కస్టేషన్‌కు వెళ్లి రైలింజన్ డ్యూటీ
- అధికారుల అనాలోచిత నిర్ణయంతో రైల్వేకు తీవ్ర నష్టం



ఎర్రగుంట్ల రన్నింగ్‌స్టాఫ్ డిపో క్రూసెంటర్

రాజంపేట: అధికారుల అనాలోచిత నిర్ణయంతో ఆవిర్భవించిన ఎర్రగుంట్ల క్రూసెంటర్ పరిధిలో విధి నిర్వహణ లోకో పైలెట్స్‌కు భారమైంది. ప్రధానంగా వీరు ఉపిరితిత్తుల సమస్యలతో పాటు మరికొన్ని అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీంతో ఎర్రగుంట్ల డిపోకు దూరంగా పోయేందుకు తంటాలు పడుతున్నారు. చాలామంది తిరిగి నందలూరు, రేణిగుంట, గుత్తికి వెళ్లిపోవాలనే నిర్ణయానికి వచ్చేశారు.

సరిదిద్దుకోలేని నిర్ణయంతో ఎల్‌పీలకు కష్టాలు..

డివిజన్ రైల్వే అధికారులు తీసుకున్న సరిదిద్దుకోలేని నిర్ణయం ఫలితంగా ఎల్‌పీలకు కష్టాలు తప్పడంలేదు. కాలుష్యకోరల్లో అనారోగ్యభయం వీరిని వెంటాడుతోంది. ఇటీవల ఓ ఉద్యోగిని ఉపిరితిత్తుల సమస్య వల్ల విధులు చేయలేకపోవడంతో మరోస్టేషన్‌కు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ డిపోకు రన్నింగ్‌స్టాఫ్ విధి నిర్వహణపరంగా రెడ్‌సిగ్నల్ వేస్తున్నారు. . ఓ వైపు కాలుష్యం..మరోవైపు దాహార్తి, ఇతర సౌకర్యాలు మృగ్యమవుతున్నాయి.

పక్కస్టేషన్‌కు వెళ్లి రైలింజన్ల డ్యూటీలు

ఎర్రగుంట్ల డిపోలో పనిచేస్తున్న ఎల్‌పీలు పక్కస్టేషన్‌కు వెళ్లి రైలింజన్ల డ్యూటీలు చేస్తున్నారు. ఇందు కోసం వారికి ప్రైవేటు వాహనాన్ని ఏర్పాటుచేశారు. గూడ్స్‌రైళ్లకు ఎర్రగుంటల్లో క్రూ చేసుకోవడం వల్ల ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ విధమైన సంఘటనలు అనేకం జరిగిన నేపథ్యంలో ప్రయాణికులు విమర్శలు గుప్పించారు. అదనంగా లైన్ల నిర్మాణానికి కూడా వీలు లేని పరిస్థితులు ఉన్నా యి. దీంతో రేణిగుంట వైపు కలమల, గుత్తి వైపు నుంచి వచ్చే గూడ్స్‌రైళ్లను ఎర్రగుడిపాడులో ఆపి అక్కడి జీపులలో లోకోపైలెట్స్‌ను తరలిస్తున్నారు. గూడ్స్‌రైళ్ల ట్రాఫిక్‌కు సరిపడే లైన్లు లేకపోవడంతో గుంతకల్ వైపు వెళ్లే వాటికి ఎర్రగుడిపాడు, రేణిగుంట వైపు గూడ్స్‌రైళ్లకు కలమల్లలో రిలీఫ్ ఇస్తున్నారు. అప్పుడు ఎర్రగుంట్ల డిపో అనవసరమని కార్మిక వర్గాలు పెదవి విరిస్తున్నాయి.



ఎర్రగుడిపాడులో రిలీఫ్ కోసం గూడ్స్‌రైలు

ప్రైవేటు వాహనాల్లో విధులు తరలిస్తున్న క్రమంలో ఎల్‌పీలు ప్రమాదానికి గురై మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. ఇందుకు రేణిగుంట–ఏర్పేడు మధ్యలో ప్రైవేటు వాహనంలో రిలీఫ్ కోసం వెళుతున్న శివయ్య అనే లోకోపైలెట్ మృతి చెందిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ ఈ విధానాన్ని అధికారులు అవలంభిస్తున్నారు. ప్రైవేటు వాహనాల కాంట్రాక్టు లబ్ధి కోసం పెడుతున్నారని విమర్శలున్నాయి.

ఎస్‌ఐల బదిలీ

కడప అర్బన్: వైఎస్‌ఆర్ జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న 10 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా వున్నాయి.

ఎస్‌ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రదేశం
ఎస్. రాజరాజేశ్వరరెడ్డి	ఖాజీపేట	మైదుకూరు
కె. వెంకటరమణ	వి.ఆర్.కడప	వల్లూరు
ఎస్. కుళ్లాయప్ప	వి.ఎస్.పల్లె	వి.ఆర్.కడప
కె.వెంకటరెడ్డి	వి.ఆర్. కర్నూలు రేంజ్	వి.ఎస్.పల్లె
కె. చిన్నపెద్దయ్య	చెన్నూరు	వి.ఆర్.కడప
బి. శ్రీనివాసులరెడ్డి	చింతకొమ్మదిన్నె	డీఎస్‌బీ, కడప
జె.రవికుమార్	లింగాల	బద్వేల్ రూరల్
కె. ప్రదీప్‌నాయుడు	డీఎస్‌బీ, కడప	కడప దిశ
ఎస్.కె.అన్వర్‌బాషా	డీఎస్‌బీ, కడప	కడప దిశ
టి.కల్పన	వి.ఆర్. కర్నూలు రేంజ్	జమ్మలమడుగు

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు వేగవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్



మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్: గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చేయాల్సిన ముందస్తు ఏర్పాట్ల పురోగతిపై డీఆర్వో గంగాధర్ గౌడ్, ఏఎస్పీ కృష్ణారావులతో కలసి అన్ని శాఖల అధికారులతో జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 26న స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే వేడుకల్లో జెండా వందన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు ఎంత వరకు వచ్చాయని ఆరా తీయగా శుక్రవారం ఉదయం వెళ్లి గ్రౌండ్ ను పరిశీలించామని, పనులు మొదలు పెడతామని, శకటాల విషయంగా యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని తగిన చర్యలు తీసుకుంటున్నామని శాఖ అధికారులు వివరించారు. స్టాల్స్‌ను ఆకర్షణీయంగా, వినుత్నంగా ఏర్పాటు చేయాలన్నారు. వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని, సీటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉదయం పరేడ్ మైదానంలో, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కన్నుల పండువగా సాగేలా సంసిద్ధం చేయాలని డీఈవోను ఆదేశించారు. ముఖ్యంగా ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయడానికి సంబంధిత ప్రతిపాదిత జాబితాను నిర్ణీత గడువు లోపు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డ్వామా, డీఆర్డీఏ, ఐసీడీఎస్ పీడీ లు యదుభూషన్ రెడ్డి, ఆనంద నాయక్, శ్రీలక్ష్మి, సీపీఓ వెంకట రావు, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ శ్రీనివాస రెడ్డి, గృహనిర్మాణ శాఖ పీడీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

కడప అర్బన్ : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో చిక్కిన వారికి శుక్రవారం కడప జిల్లా కోర్టులోని ఫస్ట్ స్పెషల్ జేఎసీఎం కోర్టు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

- జిల్లాలోని ప్రొద్దుటూరుకు చెందిన మస్తాన్ (25) ఈ నెల 18న మద్యం సేవించి ట్రాక్టర్ నడుపుతూ ట్రాఫిక్ పోలీసుల బ్రీత్ ఎనలైజర్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేశారు. విచారణలో సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో నిందితునికి మెజిస్ట్రేట్ 7 రోజుల జైలు శిక్షతోపాటు రూ.3500 జరిమానా విధించినట్లు కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి తెలియజేశారు.
- షేక్ షామీర్ (20) ఈనెల 17న మద్యం సేవించి మోటార్ సైకిల్‌ను నడుపుతూ ట్రాఫిక్ పోలీసుల బ్రీత్ ఎనలైజర్‌కు చిక్కాడు. అతనిపై నేరం రుజువు కావడంతో ఏడు రోజుల జైలు శిక్షతోపాటు, రూ. 3000 జరిమానా విధించారు.
- గజ్జల నాగమల్లారెడ్డి (30) ఈ నెల 18న మద్యం సేవించి మోటార్‌సైకిల్‌ను నడిపాడు. అతనికి నాలుగు రోజుల జైలు శిక్షతోపాటు రూ. 3000 జరిమానా విధించారు.

46 మద్యం బాటిళ్లు సీజ్

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 46 మద్యం బాటిళ్లను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ప్రొద్దుటూరు మండలం బొజ్జవారిపల్లె గ్రామానికి చెందిన చిన్న గూడూబాయిగారి రహంతుల్లా అక్రమ మద్యాన్ని తరలిస్తుండగా తమ సిబ్బందితో కలసి పట్టుకున్నామని ఎస్‌ఐ ఆర్‌వీ కొండారెడ్డి చెప్పారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

వాహన తనిఖీల్లో నగదు స్వాధీనం



వస్త్ర వ్యాపారి వద్ద స్వాధీనం చేసుకున్న డబ్బుతో పోలీస్ అధికారులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. మల్లకతువ చెక్‌పోస్టు వద్ద గురువారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రొద్దుటూరుకు చెందిన వస్త్ర వ్యాపారి కొండయ్య వద్ద రూ.2,69,450 ఎలాంటి బిల్లులు, ఆధారాలు లేకుండా ఉండటంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. అలాగే వనిపెంటకు చెందిన పెద్ద మస్తాన్ దగ్గర రూ.2,50,000 ఆధారాలు లేకుండా ఉండటంతో స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఒంటిమిట్ట : మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలో ఉన్న విష్ణు దేవాలయం వద్ద శుక్రవారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒంటిమిట్ట మండలం నరసన్నగారిపల్లి గ్రామానికి చెందిన ఖాదర్‌బాషా ద్విచక్రవాహనంలో ఒంటిమిట్ట నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన నాగేష్ ఒంటిమిట్టకు ద్విచక్ర వాహనంలో వెళ్తున్నాడు. ఎదురెదురుగా వస్తున్న ఈ వాహనాలు ఢీకొనడంతో.. వారిద్దరికీ గాయాలు అయ్యాయి. బాధితులను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

అంబేడ్కర్ ఆశయం..
జగనన్నతోనే సాధ్యం





దళితులతో కలిసి ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, తదితరులు



డిజిటల్ స్క్రీన్ ద్వారా సీఎం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న దృశ్యం

- బి.మఠంలో భారీ ర్యాలీ
- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మండలంలోని 2 వేల మంది దళితులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమీపంలో ఉన్న ఖాళీ ప్రాంగణంలో పెద్ద డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసి.. విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం సౌకర్యం కల్పించారు. ఎమ్మెల్యేతోపాటు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నాగిరెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, బీమఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, మండల కన్వీనర్ మేకల రత్నకుమార్ యాదవ్, సింగిల్ విండో నేలటూరు సుబ్బిరెడ్డితోపాటు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ నాయకులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, దళిత సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సీఎం జగన్ చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని తిలకించారు. అక్కడికి వచ్చిన వారికి భోజన సౌకర్యం కల్పించారు.

మాట తప్పిన టీడీపీ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డులో ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయం. గత టీడీపీ అమరావతిలో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేస్తామని చెప్పి శంకుస్థాపన చేసి వదిలేసింది. కానీ ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మేరకు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయం.

– పులి సునీల్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్

అపరూప ఘట్టంపై హర్షాతిరేకం



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అరుదైన గౌరవం కల్పిస్తూ.. శుక్రవారం సాయంత్రం విజయవాడలో భారీ విగ్రహాన్ని ఆవిష్కరించడంపై దళిత, బడుగు, బలహీన వర్గాలు, ప్రజా సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును గాలికి వదిలేసిందని వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా నడుస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని తెలియజేస్తున్నారు.

– కడప కోటిరెడ్డిసర్కిల్/బద్వేలు అర్బన్

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించే ప్రభుత్వం



బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందాలన్న అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అందుకు తగ్గట్టుగానే విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేశారు. అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు దేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది.

– సంగటి దావీదు, జెడ్పీటీసీ, బి.కోడూరు

చరిత్రలో నిలిచిపోతారు



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సమాన హోదా కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా విజయవాడలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామం.

– సోదసదాసి శ్యాముల్, అధ్యక్షుడు, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ, కడప

ఆనందదాయకం



ఆనాడు అంబేడ్కర్ దళిత, బహుజన, మైనార్టీలకు సమన్యాయం కల్పించి సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు అందించారు. అయితే నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ కేంద్రంలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తగిన గౌరవం, గుర్తింపు కల్పించినట్లయింది.

– ఇల్లూరి సురేష్, మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు, కడప

దేశానికే తలమానికం



రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలోని స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన భారీ అంబేడ్కర్ విగ్రహం దేశానికే తలమానికంగా నిలవనుంది. అంబేడ్కర్ భావజాలాన్ని అనుసరిస్తూ పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రపంచం గర్వించదగ్గ రీతిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం గొప్ప విషయం.

– ముత్యాలప్రసాద్, జెడ్పీటీసీ, పోరుమామిళ్ల

అభినందనీయం



విజయవాడ నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేయడం అభినందనీయం. బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆరాధ్యదైవం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు ప్రభుత్వం ఇచ్చిన అరుదైన గౌరవం ఇది.

– ఎస్.సుదర్శన్, ఎస్సీ కమిషన్ మెంబర్

పోలీసులకు ప్రోత్సాహక అవార్డులు



అవార్డులు అందుకున్న పోలీసులతో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఉత్తమ పనితీరు కనపరిచిన వారికి 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు'ను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నలుగురు సిబ్బందిని ఎంపిక చేసి నగదు రివార్డు, ప్రశంసాపత్రం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

- ప్రొద్దుటూరు ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహన తనిఖీల్లో ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.35 లక్షలు నగదు స్వాధీనం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుళ్లు ఎం.శ్రీనివాసులు, పి.నవీన్‌కుమార్‌ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.
- జమ్మలమడుగు పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహన తనిఖీల్లో ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.5 లక్షలు నగదు స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుళ్లు పి.నాగేంద్ర, వి.లక్ష్మణ్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్ మెడికల్ సమస్యల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. తగిన పరిష్కారం చూపుతామని ఎస్పీ భరోసా కల్పించారు.

కడపలో స్కూటీ చోరీ

కడప అర్బన్ : కడప నగరంలోని రవీంద్రనగర్‌లో పాత లా కాలేజీ వెనుక భాగాన వున్న ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసిన స్కూటీని శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. బాధితులు చుట్టుపక్కల ఇంటి వారితో చర్చించారు. సమీపంలోని ఇంటికి ఉన్న సీసీ కెమెరాలో పరిశీలించగా.. కొన్ని నిమిషాల వ్యవధిలోనే గుర్తు తెలియని వ్యక్తి స్కూటీని దొంగలించుకుని వెళ్లినట్లు సీసీ ఫుటేజీల ద్వారా తెలుస్తోంది. దొంగ తన ముఖాన్ని కనిపించకుండా జాగ్రత్త పడ్డాడు. ఈ సంఘటనపై బాధితులు పోలీసుల దృష్టికి తీసుకుని వెళ్లారు. సమగ్రంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

నవశకం

ఒక్క రోజులోనే ధ్రువ పత్రాలు



గతంలో ఏవైనా ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా సకాలంలో పత్రాలు అందేవి కావు. పైగా ఎంతో కొంత డబ్బు ముట్టచెప్పనిదే సర్టిఫికెట్లు చేతికి వచ్చేవి కావు. నాకు వైఎస్సార్ చేయూత పథకం కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాల్సి వచ్చింది. ఇంత త్వరగా ధ్రువీకరణ పత్రాలు ఎలా పొందాలి అని అనుకుంటున్న సమయంలో.. మా వార్డు వలంటీర్ శివ వచ్చి జగనన్న సురక్ష కార్యక్రమంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. అవసరమైన వాటికి సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో వెంటనే దరఖాస్తు చేసుకున్నాను. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఒక్క రోజులోనే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. దీంతో చేయూత పథకానికి దరఖాస్తు చేసుకోవడంతో రూ.18,750 నగదు కూడా అందింది. జగనన్న పాలన చాలా బాగుంది.

– కె.వెంకటసుబ్బమ్మ, కాపువీధి, బద్వేలు

నాణ్యమైన విద్య అందించడమే సీఎం లక్ష్యం



రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేశారు. అంతేకాక పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

– జిలానీ, ఉపాధ్యాయుడు, పులివెందుల

వేటు పడింది..!

- ఇద్దరు సీసీలు సస్పెన్షన్
- నలుగురు సంఘమిత్రలకు నోటీసులు
- సీఐఎఫ్ నిధుల దుర్వినియోగంపై చర్యలు



పెద్దతిప్పసముద్రం మండల సమాఖ్య కార్యాలయం

పెద్దతిప్పసముద్రం (అన్నమయ్య జిల్లా) : స్త్రీ నిధి, సీఐఎఫ్ నిధుల దుర్వినియోగంపై డీఆర్‌డీఏ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. అవినీతికి పాల్పడిన వారిపై వేటు వేశారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం మండలంలో వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం పరిధిలో పని చేస్తున్న ఏపీఎం, సీసీలు, సంఘమిత్రల చేతివాటంపై ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తాయి. స్త్రీ నిధి, కమ్యూనిటీ ఇన్‌వెస్ట్‌మెంట్ ఫండ్ (సీఐఎఫ్) సొమ్ము మాయాజాలంపై ఉన్నతాధికారులకు భారీగా ఫిర్యాదులు అందాయి. అలాగే పలు మహిళా సంఘాల సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా డీఆర్‌డీఏ సత్యనారాయణ నాలుగు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి సమగ్రంగా ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. ఇటీవల జరిగిన నాలుగు వీవో పరిధిలోని గ్రూపు రికార్డులు, మంజూరైన రుణాలు, బ్యాంకులకు జమ చేసిన నిధుల వివరాలను మహిళా సంఘాల సభ్యుల సమక్షంలో.. సమగ్రంగా రికార్డులను పరిశీలించి ఆడిట్ నిర్వహించగా రూ.20 లక్షల సొమ్ము స్వాహా అయినట్లు బట్టబయలైంది. గడువు ముగిసినా స్త్రీ నిధి, సీఐఎఫ్ రుణాల రికవరీలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ, రుణాలు పొందిన సభ్యుల నుంచి వసూలు చేసిన నెలవారి కంతుల సొమ్మును బ్యాంకులకు జమ చేయకుండా మీనమేషాలు లెక్కించే సంఘమిత్రలు.. ఆడిట్‌తో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

రికవరీ నోటీసులు జారీ

నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు వచ్చిన వారిలో మండలంలోని కందుకూరు, పీటీఎంలలో సీసీలుగా పని చేసిన చెన్నప్ప, రెడ్డిరాణిలను సస్పెండ్ చేశారు. నలుగురు సంఘమిత్రలైన శంకరమ్మ, నాగరత్నమ్మ, అలివేలమ్మ, నరసింహులుకు రికవరీ నోటీసులు జారీ చేయాలని ఇటీవల జిల్లా కేంద్రం నుంచి మండల సమాఖ్య కార్యాలయానికి సర్క్యులర్ జారీ కావడంతో.. నోటీసులు జారీ చేశామని ఏపీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు.

అన్ని చోట్లా ఆడిట్ నిర్వహించాలి

మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో 1,205 మహిళా సంఘాలు ఉన్నాయి. 12 వేల మందికి పైగా మహిళలు గ్రూపుల్లో సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈ సంఘాలన్నీ 34 గ్రామ సమాఖ్యల (వీవో)ల పరిధిలో ఉండగా.. 37 మంది సంఘమిత్రల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. అయితే ఆడిట్ అనంతరం సంఘమిత్రలకు రికవరీ నోటీసులు జారీ చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమపై కక్షతోనే ఇలా జరిగిందని పలువురు సంఘమిత్రలు ఆరోపిస్తూ మండలంలో మిగిలిన వీవోల్లో కూడా ఆడిట్ నిర్వహించాల్సిందేనని పట్టుబడుతున్నట్లు సమాచారం.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ONE SITTING
■ One Sitting, 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc, MBA, BBA, BCA, B.Tech, Diploma, Agriculture, Pharmacy, Nursing (for dropouts / backlogs) from UGC recognised universities. Exams in February / March. Cont : 73383 76874

WANTED
■ కడప నగరంలో లేడీస్ హాస్టల్ నందు పనిచేయుటకు మహిళ వర్కర్ మరియు లేడీ వంట మనిషి, వంట సహాయకురాలు కావలెను. భోజనం, వసతి కల్పించబడును. సంప్ర. సెల్: 8919810825
■ కస్టమర్లకు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీ/పురుషులు ఆయా,నర్సులు, వంట చేయువారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ. 15000-40000,ఫ్రీరూం+భోజనం.HYD.7995385999.
■ అమెజాన్‌లో అన్‌లోడింగ్(8) పనిచేయుటకు డెలివరీ బాయ్స్ కావలెను. కడప వారికి ప్రాధాన్యత. జీతం8-15వేలు + ఇన్సూరెన్స్. పెన్నా డెలివరీ సర్వీసెస్. సంప్ర:: 8309585872, 9866999346, 7893626501
■ GKS Plywood షోరూం నందు పనిచేయుటకు వర్కర్స్ కావలెను. మార్కెటింగ్ అనుభవం, లోకల్ వారికి ప్రాధాన్యత ఆకర్షణీయమైన జీతం. ప్రొద్దుటూరు: 8885225664, 9989434587
■ CK Plywood షోరూం నందు పనిచేయుటకు యువతి, యువకులు కావలెను. అనుభవంగల వారికి, లోకల్ వారికి ప్రాధాన్యత, ప్రొద్దుటూరు. సంప్ర: 9848131355, 9440490804
■ ప్యాకింగ్‌హెల్పర్,ఆఫీస్‌బాయ్స్,లోడింగ్ అన్‌లోడింగ్ కడప రాజీవ్ పార్క్ దగ్గర ప్రొద్దుటూరు మైదుకూరు రోడ్డు బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూమ్‌లో4 Week Off, PF, ESI కలదు.9989139239, 7396016024.
■ నిరుద్యోగులకు శుభవార్త! కడప జిల్లాలో మా సంస్థలో పనిచేయుటకు యువతీ/యువకులు కావలెను. జీ:14వేలు+DA6వేలు+రూం, భోజనం ఫ్రీ. అ:7th-డిగ్రీ, ITI, డిప్లొమా. సం.ప్ర: 8502400850.
■ Wanted Pro's and Mentors for Vowel Group of Institutions. No. Posts : 15. Working areas Nellore & Kavali. Salary: 20,000/- to 30,000/-. Nellore Contact : 8712611403, 8712611346, 8712611345. Kavali Contact: 8712611346, 8712611402. Interview date 20th & 21st Jan.
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18K. Ph: 9160900024 / 9640400073

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గెనుసుగడ్డల సాగు.. లాభాలు బాగు

- కిలో ధర రూ.20
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి



పొలంలో నుంచి గెనిసిగడ్డలను బయటకు తీస్తున్న దృశ్యం



రాశిగా పోసిన గెనిసిగడ్డలు



గుర్రంకొండ (అన్నమయ్య జిల్లా) : గెనుసుగడ్డల సాగు రైతులకు సిరులు కురిపించింది. టమాట, కూరగాయలు, పూల సాగు కంటే.. అధిక లాభాలు తెచ్చిన పంట గెనుసుగడ్డలు. జిల్లాలో ఈ ఏడాది వీటి సాగు తక్కువగా చేపట్టారు. దీంతో మార్కెట్‌లో అధిక డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం కిలో రూ.20 వరకు పలుకుతున్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తున్నాయి.

జిల్లాలో 1250 ఎకరాల్లో సాగు

జిల్లాలోని పడమటి ప్రాంతాల రైతులు 1250 ఎకరాల్లో గెనుసుగడ్డల సాగు చేపట్టారు. గతేడాది 2650 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 50 శాతం మేరకు తగ్గడం గమనార్హం. వీటికి రబీ సీజన్ ఎంతో అనుకూలం. పంటను సాగు చేసి ప్రస్తుతం కోతలు కోస్తున్నారు. సాధారణంగా అక్టోబర్ నుంచి జనవరి వరకు సాగు ఉంటుంది. ఎకరానికి దుక్కుల దగ్గరి నుంచి తీగెలు నాటడం .. ఎరువులు, కూలీలు, పంట చేతికొచ్చే వరకు మొత్తం సాగు ఖర్చు రూ.50 వేలలోపే ఉంటుంది. చీడపీడలు, రసాయనిక ఎరువుల వాడకం ఖర్చులు తక్కువగా ఉంటాయి. కూలీల అవసరం ఎక్కువగా ఉండదు. మొదట గెనుసుగడ్డల తీగెలు నాటే సమయంలోనూ, ఆ తరువాత పంట అదనుకొచ్చిన తరువాత పొలంలో నుంచి గడ్డలు తవ్వి బయటకు తీసేందుకు మాత్రమే కూలీల అవసరం ఉంటుంది. సాగుకు పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉన్న పంట ఇదే కావడం గమనార్హం.

ఈ ఏడాది మంచి దిగుబడి

ఈ ఏడాది గెనుసుగడ్డల సాగు మంచి దిగుబడి ఇచ్చింది. ఎకరానికి సాధారణంగా 7 నుంచి 9 టన్నుల వరకు వస్తుంది. అయితే ఈ ఏడాది 9 నుంచి 12 టన్నుల వరకు వచ్చింది. వీటిని గోనెసంచుల్లో నింపి మార్కెట్లకు తరలిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.16 నుంచి రూ.20 వరకు పలుకుతున్నాయి. మొదటి రకం రూ.20, రెండవ రకం రూ.18, మూడవ రకం కిలో రూ.16 వరకు ధర పలుకుతున్నాయి. ఈ లెక్కన ఎకరాకు రూ.1.80 లక్షల నుంచి రూ.2.40 లక్షల వరకు వస్తోంది. పంట సాగు, పెట్టుబడి ఖర్చు పోనూ రూ.లక్ష నుంచి రూ.1.90 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. గెనిసిగడ్డల తీగెలు పాడిఆవులకు పశుగ్రాసంగా కూడా ఉపయోగపడుతాయి. అంతేకాకుండా గెనిసి తీగెలను విత్తనపు తీగెలుగా అమ్ముకోవడం ద్వారా మరింత ఆదాయం వస్తోంది.

బయటి రాష్ట్రాల్లో డిమాండ్

గెనుసుగడ్డలకు బయట రాష్ట్రాల్లోని మార్కెట్లలో మంచి డిమాండ్ ఉంది. కాబట్టి ఇక్కడి రైతులు బెంగళూరు, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ మార్కెట్లకు తరలిస్తుంటారు. మన రాష్ట్రంలోని కడప, తిరుపతి, గుంటూరు, విజయవాడ నగరాల్లోని మార్కెట్లకు తీసుకెళ్తుంటారు. బయటి రాష్ట్రాల నుంచి కొంత మంది వ్యాపారులు ఇక్కడికి వచ్చి.. పొలాల దగ్గరే కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు.

గ్రీసు తయారీలో వినియోగం

ఇక్కడి గెనిసిగడ్డలను ఉత్తరాది రాష్ట్రాల్లో గ్రీసు తయారీలో ఎక్కువగా వినియోగిస్తుంటారు. బయట రాష్ట్రాల్లోని మార్కెట్లలో గెనిసిగడ్డలను తినడానికి వినియోగించడంతోపాటు గ్రీసు తయారీకి గానూ ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు. దీంతో పలు రాష్ట్రాలకు చెందిన ఫ్యాక్టరీ యజమానులు.. వ్యాపారుల ద్వారా కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు.

రెండున్నర ఎకరాల్లో సాగు చేశా



రెండున్నర ఎకరాల పొలంలో ఈ ఏడాది గెనుసుగడ్డల సాగు చేశాను. ఎకరానికి రూ. 40 వేల వరకు సాగు ఖర్చు వచ్చింది. మిగిలిన పంటలతో పోల్చితే ఈ పంట సాగుకు పెట్టుబడి ఖర్చు చాలా తక్కువ. మార్కెట్‌లో ప్రస్తుతం కిలో రూ.16 నుంచి రూ.20 వరకు ధర పలుకుతున్నాయి. ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ పంట లాభసాటిగా ఉంది.

– గుర్రప్ప, రైతు, తలారివాండ్లపల్లె

నిలకడైన ఆదాయం



ఈ ఏడాది గెనుసుగడ్డలు ఒక ఎకరంలో సాగు చేశాను. ప్రస్తుతం టమాట, కూరగాయల సాగు కంటే.. గెనుసుగడ్డల సాగు ఆదుకొంది. అన్ని ఖర్చులు పోను ఎకరానికి రూ.1.30 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది తమిళనాడు రాష్ట్రానికి గెనిసిగడ్డలను ఎగుమతి చేశాం. అక్కడి మార్కెట్‌లో మంచి ధరలు ఉన్నాయి. ఇలా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడం వల్ల రైతులు బాగు పడే అవకాశముంది.

– నరసింహులు, రైతు, కొత్తపల్లి